క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

నార్పల: చామలూరు, నిలువురాయి గ్రామాల్లో గురువారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నిట్టూరు రఘునాథ్‌రెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని వారు కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


రమేష్ బాబు


సుబ్రమణ్యం

తాడిపత్రి టౌన్ : స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో బుధవారం స్థానిక రోటరీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కె. రమేష్‌బాబు, కార్యదర్శిగా పి. సుబ్రమణ్యం, కోశాధికారిగా కె.ప్రవీణ్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు క్లబ్ అధ్యక్షుడు షాకీర్ బాషా తెలిపారు. నూతన కార్యవర్గం జూలై ఒకటవ తేదీ నుంచి బాధ్యతలు స్వీకరిస్తుందన్నారు. సమావేశంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి


కలెక్టర్ గౌతమికి వినతిపత్రాన్ని అందజేస్తున్న సర్పంచులు

గుంతకల్లు రూరల్: గ్రామ పంచాయతీలకు నుంచి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని సర్పంచులు బుధవారం కలెక్టర్ గౌతమికి వినతి పత్రం అందజేశారు. ఆర్డీఓ కార్యాలయాన్ని సందర్శించిన ఆమె ఆర్డీఓ రవీంద్రతో కలిసి కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులను పరిచయం చేసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అదేసమయంలో మండలంలోని సర్పంచులు అందరూ ఆర్డీవో కార్యాలయానికి చేరుకొని సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

వ్యక్తి ఆత్మహత్య

పామిడి: పాళ్యంతండాలో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. తండాకు చెందిన వీ భీమన్ననాయక్(59), సువర్ణమ్మ కూలీ పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించేవాడు. ఇద్దరు కుమార్తెలుండగా వారికి పెళ్లి చేశాడు. మద్యానికి బానిసైన అతడు జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటర్ తరగతులు ప్రారంభం


తరగతులకు హాజరైన విద్యార్థులు

తాడిపత్రి టౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. ఈనెల 21 వరకు ఉదయం 9–30 గంటల నుంచి సాయంత్రం 4 వరకు తరగతుల నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు.

కార్డుదారులకు జొన్నల పంపిణీ

గుత్తి: కోట వీధిలోని 12,13వ వార్డుల్లో బుధవారం తహసీల్దార్ మహబూబ్ బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ ఉచిత జొన్నల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రేషన్ కార్డుదారులకు ఒక్కొక్కరికి మూడు కిలోల చొప్పున జొన్నలను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. కౌన్సిలర్లు నజీర్, మర్తాడు హసీనా, నరేష్, ఫరూక్, వాల్మీకి శివ, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : మండల కేంద్రంలో బుధవారం కార్డుదారులకు తహసీల్దార్ ఈరమ్మ, సర్పంచ్ వరలక్ష్మి, ఎంపీటీసీ ఉచితంగా జొన్నలు పంపిణీ చేశారు.

జగనన్న పాలనలో ప్రజలు సుభిక్షం

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

గార్లదిన్నె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తలగాచిపల్లి, ఓబులాపురం, జంబులదిన్నె, జంబులదిన్నె కొట్టాలలో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలసి ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాల పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రభుత్వం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో సువర్ణ పాలన కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు రాజకీయ, ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే జగనన్న లక్ష్యమన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు అనేక పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న టీడీపీ నేతలకు సైతం సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోపిడీ చేశారని విమ ర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, వైస్ ఎంపీపీ కుంచం రామో హ్మన్‌రెడ్డి, జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, తహసీల్దార్ ఉషారాణి, ఎంపీడీఓ విజయ భాస్కర్, హౌసింగ్ ఏఈ విజయ భాస్కర్ రావు, ఏఓసోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి


తలగాచిపల్లిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

- ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

గుంతకల్లు రూరల్: ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా నిత్యం ప్రజల కోసం పనిచేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నల్లదాసరపల్లిలో ఎమ్మెల్యే వైవీఆర్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కుమార్తె మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతీరెడ్డితో కలిసి గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లిన ఎమ్మెల్యే నాలుగేళ్లలో ప్రతి కుటుంబానికి కలిగిన లబ్ధిని తెలియజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేశామని ఏదైనా కారణంచేత పథకాలు అందని వారు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందస్తోందదన్నారు. సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రభుత్వకార్యాలయాల చుట్టూ తిరిగి గ్రామీణ ప్రాంతాల ప్రజలు విసిగిపోతున్న తరుణంలో సచివాలయాలను ప్రారంభించి, వలంటీర్ల ద్వారా నేరుగా ఇంటివద్దకే సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రైతు శ్రేయస్సు కోసం రైతు భరోసా కేంద్రాలు, ప్రజారోగ్య పరిరక్షణ కోసం వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజల పట్ల తనకు ఉన్న బాధ్యతను చాటుకున్నారన్నారు. వచ్చు ఎన్నికల్లో జగనన్న మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఎంపీడీఓ జాషువా, ఎంపీపీ బీపీ మాధవి, వైస్ ఎంపీపీ చింబిలి ప్రభావతి, సర్పంచ్ ఎర్రలింగమ్మ, ఎంపీటీసీ ఆంజనేయులు, కిసాన్‌సెల్ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, మండల కన్వీనర్ మోహన్, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి, నారాయణరెడ్డి, వాల్మీకి హరి, మోహన్‌రెడ్డి, నల్లప్ప, బాలక్రిష్ణ, హరిశ్చంద్ర, బైపు వెంకటేష్, దొడ్డి ఆంజనేయులు, వసంత, లక్ష్మన్న, నెలగొండ మాజీ ఎంపీటీసీ జయరామిరెడ్డి, కసాపురం మాజీ సర్పంచ్ తిక్కస్వామి, విద్యార్థి విభాగం నాయకుడు వినోద్ కుమార్ రెడ్డి, నక్కా ఓబులేసు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి ఆర్థిక సాయం

గ్రామానికి చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచం పట్టాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వైవీఆర్ చంద్రశేఖర్ ఇంటికి వెళ్లి అతడి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించాడు. ఎమ్మెల్యే ఆర్థిక సాయాన్ని అందజేయడంతోపాటు, అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ, ఎమ్మెల్యే


వైఎస్సార్‌సీపీ నేతలతో మాట్లాడుతున్న ఎంపీ రంగయ్య, పైలా నరసింహయ్య

తాడిపత్రి: వంగనూరులో బుధవారం జరిగిన పెద్దమాంబ అమ్మవారి జాతరకు అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, యువ నేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, మైనార్టీ నేత ఫయాజ్‌బాషా, పేరం నాగిరెడ్డి, కాకర్ల రంగనాథ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ రంగారావు, సర్పంచ్ అరుణ, ఆలూరు సర్పంచ్ సుబ్బయ్య పాల్గొన్నారు. అనంతరం ఎంపీ తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమయ్యారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు


ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు: స్థానిక వాసవీ కన్యకపరమేశ్వరీ దేవి ఆలయంలో బుధవారం ఆలయ వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి సహస్ర కలశాభిషేకం చేపట్టారు. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గోపా జగదీష్, కందూరి కృపాకర్, కోశాధికారి మేడం వెంకటేశ్వర్లు, నాయకులు సత్యరంగయ్య, డాక్టర్ వీ.ప్రభాకర్, ఇల్లూరు కేదార్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

యల్లనూరు: దంతలపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ అమర్‌నాథ్‌రెడ్డిని ఉన్నతాధికారులు సస్పెన్షన్ చేసినట్లు అధికారులు తెలిపారు. దంతలపల్లిలో ఇటీవల సర్పంచ్ నాగమహేశ్వరరెడ్డి, బాలవెంకటరెడ్డి వర్గాలు పరస్పర వేటకొడవండ్లు, ఇనుప రాడ్లతో దాడులు చేసుకున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ అమర్‌నాథ్ రెడ్డి వల్లనే గ్రామంలో ఉద్రిక్తత నెలకొందని యల్లనూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు అమర్‌నాథ్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేశారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకు తీవ్రగాయాలు

గుత్తి: పట్టణంలోని మద్రాస్ సత్రం వద్ద బుధవారం తెల్లవారు జామున ఎద్దుల బండిని లారీ ఢీకొనడంతో రైతుకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. రైతు లక్ష్మన్న బీసీ కాలనీ నుంచి ఎద్దులబండిపై మట్టి తీసుకుని గుత్తి ఆర్ఎస్‌కు బయలుదేరాడు. మద్రాస్ సత్రం వద్ద వెనుక నుంచి ఎద్దులబండిని లారీ ఢీ కొనింది. ఈ ప్రమాదంలో లక్ష్మన్నతో పాటు ఎద్దుకు గాయాలయ్యాయి. బండి ధ్వంసమైంది. పోలీసులు కేసు నమోదు చేశారు.

గుత్తి: పట్టణ శివారులోని గుంతకల్లు రోడ్డులో చెరువు కట్ట వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన మారెప్ప తన భార్య కేశమ్మతో కలిసి గుత్తి మండలం పెద్దొడ్డికి వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి ప్యాపిలికి బైక్‌లో ప్రయాణమయ్యారు. అయితే చెరువు కట్ట వద్ద బైక్‌పై వెనుక వైపు కూర్చొన్న కేశమ్మ ఎగిరి కింద పడింది. ప్రమాదంలో కేశమ్మ తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉన్నత స్థానాలు అధిరోహించండి


విద్యార్థులకు నియామకపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

నార్పల: విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థానాలు అధిరోహించాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అధికారులు నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవానికి ఆమె హాజరై మాట్లాడారు. సీఎం జగనన్న విద్య కోసం రూ.కోట్లు వెచ్చిస్తున్నారన్నారు. పేద విద్యార్థుల కోసం జగనన్న వసతి దీవెన, విద్యాదీవెన, అమ్మ ఒడి అమలు చేస్తున్నారన్నారు. మనబడి నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ప్రయివేట్‌కు దీటుగా తీర్చిదిద్దారన్నారు. ఎస్‌వీహెచ్ ఇండియా ఆటోపార్ట్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీలో కళాశాలకు చెందిన 24 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడం గొప్ప విషయమన్నారు. అనంతరం ఉద్యోగాలు ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలు అందించారు. తర్వాత కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. పాలిటెక్నిక్ కళాశాలకు ఐదెకరాల స్థలం విరాళంగా అందించిన దాతలు నాగర్జున, శ్రీకాంత్, గిరి, గోపాల్, చంద్రశేఖర్, రామకృష్ణ కోరిక మేరకు కళాశాలలో వారి ఫొటోలు, పేర్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కళాశాల యాజమాన్యానికి సూచించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, కో ఆప్షన్ షాబీరా, నాయకులు దాడితోట బాషా, మన్నీల శివయ్య, చికెన్ గోపాల్, రమేష్ ప్రిన్సిపాల్ డెవిడ్ ఉన్నారు.

సచివాలయాలతో సమస్యల పరిష్కారం


వంగనూరులో సచివాలయ ఉద్యోగులతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: గ్రామాల్లోనే సమస్యలు పరిష్కరించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వార్డు/ సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆలూరు, వంగనూరు గ్రామాల్లో సచివాలయ, ఆర్బీకే భవనాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సచివాయల సిబ్బంది నిత్యం అందుబాటులో ప్రజల సమస్యలకు పరిష్కరం చూపుతారని తెలిపారు.

సుడిబండి తిరునాల ప్రారంభం


సుడిబండిని ప్రారంభిస్తున్న ఏడీసీసీబీ మాజీ చైర్మన్ వీరా, ఎంపీపీ మురళీమోహన్‌రెడ్డి

పామిడి: మండలంలోని రామరాజుపల్లిలో బుధవారం సాయంత్రం సుడిబండి(బండిశిల) తిరునాల ప్రారంభమైంది. ఈసందర్భంగా సుడిబండి రథాన్ని ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి ప్రారంభించారు. అంతకుముందు సుంకులమ్మ, ముత్యాలయ్య ఆలయంలో గ్రామదేవతలను శోభాయానంగా అలకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామదేవతలు సుంకులమ్మ, ముత్యాలయ్య విగ్రహాలను చిల్లకమ్మ పల్లకీ ఉంచి మంగళవాయిద్యాల నడుమ వీధుల్లో ఊరేగించారు.

పెద్దవడుగూరు : కాశేపల్లి, గుత్తిఅనంతపురంలో బండిశిల తిరునాల బుధవారం ప్రారంభమైంది. పెద్దవడుగూరు, కాశేపల్లి, గుత్తిఅనంతపురం రైతులు శుడిబండిని లాగించే కార్యక్రమానికి తమ ఎద్దులను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయించండి

బుక్కరాయసముద్రం: ప్రభుత్వ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయించాలని శింగనమల నియోజకవర్గం స్పెషలాఫీసర్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది హౌసింగ్ కాలనీల్లో పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా ఇళ్లు పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 12న పెద్ద ఎత్తున గృహ ప్రవేశాలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కేశవర్ధన్‌రెడ్డి, కృష్ణా నాయక్, నాగజ్యోతి, మండల స్పెషలాఫీసర్, హౌసింగ్ డీఈ శ్రీమన్నారాయణ, ఎంపీడీఓ తేజోత్స్న, హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఏపీఎం మద్దిలేటి, ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

గుత్తి రూరల్: గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి నారాయణనాయక్, ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం కొత్తపేటలో నాడు-నేడు పనులు,ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం తదితర నిర్మాణ పనులపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలోని సచివాలయం, సబ్ సెంటర్ తనిఖీ చేశారు. ఎంఈఓ రవినాయక్, ఏఈలు దివ్య ప్రకాష్, మంజునాథ్, ఈఓఆర్డీ శివాజీ రెడ్డి, వైద్యాధికారి సందీప్ యాదవ్ పాల్గొన్నారు.

యాడికి: కమలపాడు పంచాయతీలో బుధవారం ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు పర్యటించారు. ఆర్బీకే, గ్రామ సచివాలయం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. డీటీ బాలమ్మ, హౌసింగ్ ఏఈ ప్రశాంత్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవరాజ్, వైస్ ఎంపీపీ చెన్నప్ప, సర్పంచు కంబగిరి స్వామి పాల్గొన్నారు.

గార్లదిన్నె: ఇల్లూరులో బుధవారం మండల స్పెషల్ ఆఫీసర్ శాంతి అధికారులతో కలిసి పర్యటించారు. సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామ సచివాలయంను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఎంపీడీఓ విజయ భాస్కర్ , హౌసింగ్ ఏఈ విజయ భాస్కర్‌రావు, ఎంఈఓ చంద్రనాయక్, ఏఓ సోమశేఖర్ న్నారు.

పుట్లూరు: నాడు-నేడు కార్యక్రమం కింద మండలవ్యాప్తంగా ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి రజనీకాంత్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కేజీబీవీలో అదనపు గదుల నిర్మాణాలను పరిశీలించారు.

నిద్రిస్తున్న వ్యక్తిపై కర్రతో దాడి

యల్లనూరు: గిర్రమ్మబావి గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో నిద్రిస్తున్న వ్యక్తిపై మరో వ్యక్తి కర్రతో దాడి చేశాడు. బాధితుడి వివరాల మేరకు.. గ్రామ సమీపంలోని గురుస్వామి మొక్కజొన్న కంకుల వద్ద కాపలాగా ఉన్నాడు. మేడికుర్తి గ్రామానికి చెందిన కురుబ మల్లికార్జున పూటుగా మద్యం సేవించి నిద్రిస్తున్న గురుస్వామిపై కర్రతో దాడి చేశాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తర్వాత అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా గతంలో గొర్రెలను తమ తోటలోకి రానివ్వొద్దని గురుస్వామి మల్లికార్జునను మందలించడంతోనే దాడి చేసినట్లు బాధితుడి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

తాగునీటి సమస్య రానివ్వొద్దు

యల్లనూరు: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య రానివ్వొద్దని ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు సిబ్బందికి సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 25 అంశాల ప్రకారం గ్రామ పంచాయతీ రిపోర్టు, ఆడిట్, లైబ్రరీ చెస్, కరెంటు బిల్లులు, తాగునీటి సమస్య, చెత్త సంపద నిర్వహణ, శాశ్వత గృహ హక్కు, జీపీడీపీ డెవలప్‌మెంట్ ప్లాన్ వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పనుల పరిశీలన

పామిడి: పట్టణంలో పారిశుధ్య పనులను ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్డీ బీవీ శశికళ బుధవారం పరిశీలించారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతోపాటు నివాసాల చుట్టూ మురుగునీరు చేరింది. వైఎస్సార్‌సీపీ పట్టణ సచివాలయాల కన్వీనర్ బీ ఆసిఫ్ ఆధ్వర్యంలో జేసీబీతో కాలువల్లో పూడికతీత చేపట్టారు.

పెద్దమ్మతల్లి జాతర

తాడిపత్రి టౌన్: స్థానిక హరిజనవాడలో బుధవారం పెద్దమ్మతల్లి జాతర ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరై పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట యువ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, నాయకులు ఆకుల పెద్దనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంకు ఘన వీడ్కోలు

పామిడి: స్థానిక సరస్వతీ విద్యామందిరం హెచ్ఎం ఓంకారప్పకు బుధవారం పాఠశాల హెచ్ఎం శ్రీనివాసన్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఇటీవలే డీఎస్సీ–98 బ్యాచ్‌కు చెందిన ఆయన్ను కణేకల్లు ప్రభుత్వ పాఠశాలకు ఉపాధ్యాయుడిగా ప్రభుత్వం నియమించింది. సరస్వతి విద్యామందిరం ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా ఏళ్ల సేవలందించినందుకు ఓంకారప్ప దంపతులకు వారు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు.

హంద్రీ-నీవా కాలువకు గండి

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం శివారులో హంద్రీనీవా కాల్వ ద్వారా గుత్తి చెరువుకు నీటిని తరలించే పిల్ల కాల్వకు బుధవారం గండి పడింది. నాలుగు రోజులుగా భారీగా కురిసిన వర్షాలకు కాలువలో నీరు పెద్ద ఎత్తున ప్రవహించడంతో నీటి ఉధృతికి కాలువకు గండి పడింది. వైటీ.చెరువు వైపు నుంచి వచ్చే ప్రధాన కాలువ నుంచి గుత్తి చెరువుకు నీటిని మళ్లించే ఉప కాలువ గట్టు కొట్టుకొని పోయి నీళ్లు వృథా అయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, గుత్తి బెస్త సంఘం నాయకులు అక్కడికి చేరుకొని గండి పడిన ప్రాంతాన్ని పూడ్చారు. అనంతరం గుత్తి ఇరిగేషన్ అధికారులు గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించాలని నిరసన

గుంతకల్లుటౌన్: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సీఐటీయూ నాయకులు దాసరిశ్రీనివాసులు, మారుతి, మల్లికార్జున, అబ్దుల్లా, షబ్బీర్, బాషా, రాము తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఆందోళన చేపట్టారు. సీపీఐ మండల కార్యదర్శి వెంకట్రాముడుయాదవ్, నాయకులు సూర్యనారాయణరెడ్డి, ముత్యాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10 లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలి

పామిడి: పామిడితో పాటు రూరల్ గ్రామీణ ప్రాంతాల ప్రభుత్వ ఉద్యోగ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు ఈనెల 10వ తేదీలోపు ఈ-కేవైసీ తప్పక చేయించుకోవాలని పామిడి పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు జెడ్ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి డీ అల్లీపీరా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెన్షనర్లు గుత్తి ఉపఖజానా కార్యాలయంలో నిర్ణీత వ్యవధిలో ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

పూలే విగ్రహ ఏర్పాటుపై సమావేశం

తాడిపత్రి టౌన్: స్థానిక శివాలయం వీధిలోని రజక సంఘ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటుపై కుల సంఘాల నాయకులతో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య సమావేశమయ్యారు. పైలా మాట్లాడుతూ పట్టణంలో జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటుకు రాజకీయాలకు అతీతంగా అందరూ ముందుకు రావాలన్నారు. నాయకులు రామశేఖర్, డీవీకుమార్, సుబ్బరాయుడు, ఆనంద్, రంగ, సూరి, బ్రహ్మయ్య ఆచారి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

శింగనమల: సీహెచ్‌సీలో రోగులకు పౌష్టికాహారం అందించడానికి దాతలు ముందుకు రావాలని డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి కోరారు. బుధవారం శింగనమల సీహెచ్‌సీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దినేష్ దంపతులు పౌష్టికాహారం అందించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రమణనాయక్, వైఎస్సార్‌సీపీ నేత శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కలశ గ్రామోత్సవం

పెద్దవడుగూరు : మండల కేంద్రంలో చౌడేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్టలో భాగంగా బుధవారం మహిళలు కలశ గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పండితులు, గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

యల్లనూరు: సచివాలయ ఉద్యోగులు రోజూ తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని ఏఓ రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం యల్లనూరు-1 సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు, ఎంఈఓ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత ధ్యాన తరగతులు

తాడిపత్రి టౌన్: స్థానిక శివాలయం వీధిలోని పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఈనెల 8 నుంచి 14 వరకు ఉదయం 8 గంటల నుంచి 10 వరకు విద్యార్థులకు ఉచిత ధ్యాన తరగతులు నిర్వహించనున్నట్లు పిరమిడ్ కేంద్ర నిర్వాహకులు రంగనాథరెడ్డి, కృష్ణమోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. తాడిపత్రి పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో స్పెషల్ క్లాసుల్లో ధ్యానం, ప్రాణాయామం, భగవద్గీత, ఆటలు, పాటలు, క్విజ్, డ్రాయింగ్, పెయింటింగ్, ప్రకృతితో అనుసంధానంపై విద్యార్థులకు వివరించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 5వతేదీలోపు పేర్లు నమోదు చేయించుకోవాలని, వివరాలకు 7702175602 నంబరులో సంప్రదించాలని సూచించారు.